క్లుప్తంగా

ఎర్రగుంట్ల నుంచి తిరుపతికి పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు : శ్రావణ మాసం మొదటి వారం పురస్కరించుకుని ఎర్రగుంట్ల పట్టణం నుంచి తిరుపతి వరకు పాదయాత్ర నిర్వహించారు. శుక్రవారం పాదయాత్ర సమితి ఆధ్వర్యంలో కడప రోడ్డులోని క్రాంతినగర్‌లో ఉన్న శ్రీరామాలయం గుడి వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రలో 300 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర చేసే భక్తులందరికీ అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చినట్లు వివరించారు. మొదటి రోజు పాదయాత్ర గండి వరకు చేరుకుందని నిర్వాహకుతు తెలిపారు.

పాలకొండలో భక్తులకు భోజన వసతి

చింతకొమ్మదిన్నె : శ్రావణమాసం పురష్కరించుకుని పాలకొండలోని పాలకొండ్రాయుడిని పూజించే భక్తులకు భోజనానికి ఇబ్బందులు లేకుండా శ్రీ బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు శనివారాలు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ ఏటూరు రామచంద్రారెడ్డి తెలిపారు.

యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువకులు

జమ్మలమడుగు : రక్తదానం చేయడంకోసం యువత ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్వచ్ఛందసేవకుల ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే ప్రమాదంలో ఉన్న వారిని కాపాడిన వారు కావడమే కాకుండా ఒక కుటుంబాన్ని వీధిన పడకుండా చేసినవారు అవుతారన్నారు. యువకులందరు తప్పనిసరిగా రక్తదానం చేయటానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండిలో రక్తదాన శిబిరం ఏర్పాటు

చక్రాయపేట : శ్రావణ మాస శనివారోత్సవాల సందర్భంగా గండి ఆలయ ఆవరణలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తుపాకుల వెంకటప్రసాద్ తెలిపారు. గండి ఆలయం, కడప రిమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు రక్త దానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు వరి పంటలో సమగ్ర ఎరువు యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని దాదిరెడ్డిపల్లెలో ఇండిక్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వాడాలన్నారు. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. ప్రతి 2 మీటర్లకి 30 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీసుకోవాలని, నారు కొనలు తుంచి ప్రధాన పొలంలో నాటాలన్నారు. దీని ద్వారా కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. కాలిబాటలు తీయడం వలన మొక్కలకు మంచి గాలి, వెలుతురు అందడంతో పాటు దోమపోటును నివారించవచ్చన్నా రు. ప్రతి మూడు పంటలకు జింక్ సల్ఫేట్ త ప్పని సరిగా వినియోగించాలన్నారు. ఖరీఫ్–2025 లో పంటలు సాగు చేసిన రైతులందరూ ఇ–పంట నమోదు తప్పని సరిగా చే యించుకోవాలన్నారు. కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుందని, కావలసిన రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గేదెల మృతిపై కేసు నమోదు

కొండాపురం : మండలంలోని ఓబన్నపేట పునరావాస కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై పాల లారీ (కె.ఎ 51 ఎడి 2296) ఢీ కొని రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై శుక్రవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఓబన్నపేట గ్రామ రైతు తలారి పెద్ద గుర్రప్పకు చెందిన ఈ పాడి గేదెలు మేతకోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు.

ఎత్తిపోతల పథకంపై అధికారుల నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పనిచేయని మోటార్లు
- 20 రోజులుగా పనిచేయని ఎత్తిపోతల పథకం
- భూమయ్యగారిపల్లె చెరువులకు చేరని సాగునీరు



నాయునిచెరువులో ఏర్పాటు చేసిన భూమయ్యగారిపల్లెకు సాగునీటిని అందించే ఎత్తిపోతల పథకం

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులకు సాగునీటిని అందించే ఎత్తిపోతల పథకంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం వద్ద చిన్న, చిన్న మరమ్మతులకు కూడా కాలయాపన చేస్తున్నా రని రైతులు అంటున్నారు. వర్షాభావంతో చెరువులలో నీరు లేక అడుగంటుతున్న భూగర్భజలాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాయుని చెరువులోని ఎత్తిపోతల ద్వారా భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె గ్రామాల్లోని చెరువులను నీటితో నింపాల్సి ఉంది అయితే గత కొద్ది రోజులుగా ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడంతో చెరువులకు నీరు చేరక ఎడారిని తలపిస్తున్నాయి. వర్షాభానికి తోడు చెరువులలో నీరు లేకపోవడంతో అడుగంటిన జలాలతో సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందించలేక రైతులు అల్లాడుతున్నారు.

భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె చెరువులకు సాగునీరు

నాయుని చెరువులోని ఎత్తిపోతల ద్వారా భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె గ్రామాల్లోని చెరువులను నీటితో నింపుతున్నారు. ఈ ఎత్తిపోతల ద్వారా మూడు మోటార్లతో 24,535 క్యూసెక్కుల నీటిని తోడుతారు. భూమయ్యగారిపల్లెలోని గంగమ్మకుంట చెరువు, ఎర్రకుంట చెరువు, రాచకుంటపల్లె చెరువులకు ఎత్తిపోతల ద్వారా సాగునీటిని తరలించా రు. ఈ చెరువులలో నీరు ఉంటే వ్యవసాయ బో ర్లలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి.

600 ఎకరాలలో పంటల సాగు

మండలంలోని భూమయ్యగారిపల్లె, రాచకుంటప ల్లె, మీదిపెంట్ల కోట గ్రామాల్లో 600ఎకరాలకుపైనే పంటలు సాగులో ఉన్నాయి. ఈ గ్రామాలలో ఎ క్కువ విస్తీర్ణంలో అరటి పంట విస్తారంగా సాగైంది. అలాగే టమోట, ఉల్లి, మిరప పంటలు సాగులో ఉ న్నాయి. ముఖ్యంగా అరటి సాగునీటితో కూడుకున్న పంట. అరటి పంటకు రోజు సాగునీరు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ఈ గ్రామాల్లో వ్యవసాయ బోర్లలో నీటి తోడకం ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుతం అరటి పంట గెలవేసే దశలో ఉంది. ఈ దశలో సకాలంలో నీటి తడులు ఇవ్వకపోతే గెలలు అనుకన్న స్థాయిలో వేసే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు. దీంతోనే రైతులు అరటి సాగుకు నీటి తడులు అందించాలంటే చెరువులను నీటితో నింపాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పనిచేయని మోటార్లు.. :

నాయునిచెరువులోని ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో ఎత్తిపోతల పథకం మోటార్లు పనిచేయలేదు. మరోవైపు నాయుని చెరువులో నీరు కూడా లేదు. చిత్రావతి నుంచి లింగాల కుడికాలువ ద్వారా నాయుని చెరువుకు నీటిని తరలిస్తారు. అనంతరం ఎత్తిపోతల ద్వారా భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె చెరువులకు నీటిని తోడేలా ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకానికి మూడు మోటార్లను అమర్చారు. ఈ పథకానికి సంబంధించిన చిన్న, చిన్న మరమ్మతులు చేయడంలో అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. నాయుని చెరువులో తోడేందుకు నీరులేక, పథకం ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక నీటిని తరలించడంలో కాలయాపన జరుగుతోంది.



మరమ్మతుల కోసం ఎత్తుకెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్ లేక ఖాళీగా ఉన్న బెడ్

నెల రోజులుగా పనిచేయని ఎత్తిపోతల పథకం



భూమయ్యగారిపల్లె ఎత్తిపోతల పథకం నెల రోజులుగా పనిచేయలేదు. ఎత్తిపోతల పథకానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకానికి సంబంధించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి 10 రోజులైనా ఇప్పటికి పథకానికి అమర్చలేదు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తున్నారనే సమాచారాన్ని అధికారులు చెబుతున్నారే తప్ప ఎప్పటిలోగా తయారవుతుందో అధికారులు చెప్పలేకున్నారు. ఎత్తిపోతల పథకంపై అధికారులు కాలయాపన చేస్తున్నారు.

– కె.వెంకట బయపురెడ్డి, జెడ్పీటీసీ, వేముల

త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతాం

భూమయ్యగారిపల్లె ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయిస్తున్నాం. త్వరలోనే ఎత్తిపోతల పథకానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతాం చెరువుకు నీరు వచ్చిన వెంటనే భూమయ్యగారిపల్లె చెరువులను సాగు నీటితో నింపుతాం.

– జ్యోతి, నీటి పారుదల శాఖ డీఈ, పులివెందుల

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్ రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

వేంపల్లె : శ్రీరాంనగర్‌లో తాగునీటి సమస్య లేకుండా చూస్తానని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతంలో సర్పంచ్ పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

యానాది కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, బోరులో నీరు తక్కువగా వస్తున్నాయని తెలిపారు. దీనికి సర్పంచ్ మాట్లాడుతూ బోరులో పైపులు దించి నీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారం చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌లపై తహసీల్దార్ ఆరా



కొత్తపల్లె వద్ద మైనింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

వేముల : మండలంలో జరుగుతున్న అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లపై తహసీల్దార్ రెడ్డిలక్ష్మి శుక్రవారం ఆరా తీశారు. మండలంలో అక్రమ మైనింగ్‌లు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. అంతేకాక ఈ ఫిర్యాదులో విచ్చలవిడిగా అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లను నిర్వహిస్తూ ముడి పదార్థాన్ని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వేములలోని ఓ మైనింగ్ వద్ద నిల్వ ఉన్న ముగ్గురాయిని రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకున్నారని, లైసెన్స్‌లు లేకుండానే జిలెటిన్ స్టిక్స్ ఉపయోగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదుతో అధికారులు స్పందించారు. శుక్రవారం తహసీల్దార్ రెడ్డిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌లు మండలంలోని వేముల, వి.కొత్తపల్లె, గొందిపల్లె గ్రామాల్లో మైనింగ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్‌లలో ఎక్కడా పనులు చేయలేదని, క్రేన్లు, ఇతర సామగ్రి మాత్రమే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్యం సోదరులు

పులివెందుల : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందులలోని తన స్వగృహంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, తన సోదరుడు వైఎస్సార్‌సీపీ నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తనను తన కుటుంబ సభ్యుడిగా భావించి గౌరవిస్తున్నారన్నారు. పార్టీ కోసం తనశక్తికి మించి కష్టపడతానన్నారు. కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అంకిరెడ్డి సురేష్‌రెడ్డి, పులివెందల ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ నంద్యాల హేమాద్రిరెడ్డి, దువ్వూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు బిదనంచర్ల బ్రహ్మానందరెడ్డి, తుపాకుల గంగిరెడ్డి, ఇండ్ల వెంకటరెడ్డి, గుజ్జల రామాంజనేయుల రెడ్డి, తుపాకుల గంగాధర్‌రెడ్డి, తుపాకుల నాగేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



శ్రావణమాస ఉత్సవాలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న గండి క్షేత్ర దేవస్థాన చైర్మన్, తదితరులు

పులివెందుల : స్థానిక భాకరాపురంలోని తన స్వగృహంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరి కొంతమంది సమస్యలను ఆయన అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరించారు. అక్కడికి వచ్చిన ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తొండూరు మండలం కృష్ణంగారిపల్లెలోని గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారుల ద్వారా, తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా గుడి నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు.

శ్రావణ మాస ఉత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గండి దేవస్థాన ఆలయ చైర్మన్ కృష్ణతేజ, ఆలయ అర్చకులు కలిశారు. ఈ సందర్భంగా వారు గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఎంపీకి అందజేశారు. శ్రావణ మాసం సందర్భంగా గండి క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయనను కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు.

అకారణంగా రేషన్ షాపును తొలగించారు

శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఇడుపులపాయకు చెందిన రేషన్ డీలర్ కలిశారు. ఈ సందర్భంగా తన రేషన్ షాపును ఉన్నఫలంగా అధికారులు తొలగించారని, తన షాపు వద్దకు వచ్చి తనిఖీలు నిర్వహించిన అధికారులు అన్ని సక్రమంగా ఉన్నా కూడా రేషన్ షాపును తొలగించడం జరిగిందన్నారు. టీడీపీకి చెందిన రేషన్ డీలర్లు ప్రజలకు 20 కేజీల బియ్యానికి డబ్బా పెట్టి 17 కేజీలు ఇస్తున్నా వారి జోలికి అధికారులు వెళ్లడంలేదన్నారు. దీనికి ఎంపీ స్పందిస్తూ రేషన్ షాపు తొలగింపుపై న్యాయ పోరాటం చేద్దామని డీలర్‌కు భరోసా ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల సందర్శన



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లెలో ఉత్తమ ప్రకృతి వ్యవసాయ యువ రైతు ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన పంటలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. గ్రామస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు సేవా కేంద్ర సిబ్బందికి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రైతులపై ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగించేలా చూడాలన్నారు. అదేవిధంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ఎస్వీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రసాయన, ప్రకృతి వ్యవసాయ వ్యవసాయాన్ని విడివిడిగా చూడకూడదని, ప్రకృతి వ్యవసాయం మనం చేస్తూ ప్రతి రైతుతో చేయించాల్సిన ప్రధాన బాధ్యత మనకే ఉందన్నారు. దీనివల్ల మన ఆరోగ్యం, మన భూమి ఆరోగ్యం, మనం పండించిన ఉత్పత్తి తిన్న వారి ఆరోగ్యం కూడా ఒకే సారి కాపాడగలిగిన వారమవుతామన్నారు. మహిళా సంఘ సభ్యులనుద్దేశించి ఏపీఎం వసంతకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆదర్శ రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోరుమామిళ్లకు చెందిన చిత్తశౌరిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో చిత్తా దంపతులు ఉచితంగా పుస్తకాలు, దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామాంజనేయులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు ఇలాంటి సాయం ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇంకా స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల పిల్లలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



ట్రాన్స్‌ఫారంను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ, ఈఈ, డీఈ, ఏఈలు

ముద్దనూరు : విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వినియోగదారులు సహించేస్థితిలో లేరని అంతరాయాలను అరికట్టి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫారంలు, లైన్లను పరిశీలించి మాట్లాడారు. కొత్త విద్యుత్ సర్వీసులు అందించడంలో జాప్యం వుండరాదని, జాప్యానికి తిరిగి వినియోగదారులకు తగిన అపరాధరుసుమును చెల్లించాల్సివుటుందన్నారు. ట్రాన్స్‌ఫారం వైఫల్యాలు అధికంగా వున్నాయని వాటివల్ల సంస్థకు నష్టంవాటిల్లుతోందని, గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పొందుటకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన పెంచాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని వినియోగదారుల సమస్యలను పరిష్కరించి వారికి అందుబాటులో వుండాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి, డీఈఈ రాజగోపాల్, స్థానిక ఏఈ శ్రీనివాసులరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్‌లోన్ రెన్యువల్ చేయాలంటే ఇబ్బందులు

వేంపల్లె : స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో గోల్డ్‌లోన్ రెన్యువల్ చేయాలంటే ఖాతాదారులు చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు గోల్డ్‌లోన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ అధికారులు మాత్రం గోల్డ్‌లోన్‌కు సంబంధించి వడ్డీ చెల్లిస్తామంటే కుదరదంటున్నారని తెలిపారు. పూర్తి డబ్బులు చెల్లించి తమ బంగారాన్ని విడిపించుకోవాలని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంత మొత్తాన్ని చెల్లించాలంటే గోల్డ్ లోన్‌దారులు నానా అవస్థలు పడాల్సివస్తోందంటున్నారు. దీంతో చాలామంది ఖాతాదారులు వేరే బ్యాంకులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇదే అదునుగా కొందరు వడ్డీ వ్యాపారులు ఖాతాదారులు గోల్డ్‌లోన్ చెల్లించాలను కుంటే ఒక రోజుకు లక్షకు రూ.2 వేలు వడ్డీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. గతంలో గోల్డ్‌లోన్ దారులు వడ్డీ చెల్లించి ప్రతి ఏడాది రెన్యువల్ చేసుకునేవారమన్నారు. ప్రస్తుతం వేంపల్లె ఎస్‌బీఐలో తప్ప.. మిగిలిన బ్యాంకులు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోల్డ్ లోన్‌ను వడ్డీతో రెన్యువల్ అవకాశం కల్పించాలని ఖాతాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌ను వివరణ అడగగా ఆర్బీఐ రూల్స్‌కు అనుగుణంగా ఉన్నతాధికారులు విధించిన రూల్స్ ప్రకారం గోల్డ్‌లోన్ దారులు పూర్తి మొత్తాన్ని చెల్లించి తమ బంగారాన్ని విడిపించుకోవాలని వివరించారు. రెండు, మూడు రోజులు తర్వాత మరలా బంగారానికి సంబంధించి లోనును మంజూరు చేస్తామని తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ముద్దనూరు : అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. శుక్రవారం ముద్దనూరులో మండంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులు అక్రమంగా తరలిస్తున్న 7 మద్యం సీసాలను, అదే గ్రామానికి చెందిన మనోహర్ వద్ద నుంచి మరో 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు



జమ్మలమడుగులో మాట్లాడుతున్న అధికారులు

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చెన్నంరాజుపల్లెలో రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పొలంలో వ్యవసాయ సిబ్బందికి, రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రొత్సహించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకోవాలన్నారు. అనంతరం నవ ధాన్యాల పంట సాగును పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సుమంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగార్జున, ఏఈఓ గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులను అరికట్టవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నాగరాజులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీ, కన్నెలూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల లార్వా నియంత్రణ చేయడం వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు నీటిని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకోకుండా వారానికి ఒకసారి తొట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్నకుమార్

లింగాల : కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంజేజేవై, ఏబీవీవీవై కార్డులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సభా భవనంలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వ పథకాల కార్డులను పునరుద్ధరించాలని, ఈకేవైసీ చేయించడం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గర్భిణులను నమోదు చేయించడం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుని ప్రతినెలా వైద్యుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలన్నారు. ఆర్‌బీఎస్‌కే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్క్రీనింగ్, అభ జనరేషన్ కంప్లీట్ చేయాలన్నారు. అనంతరం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎస్ఐ మార్క్ కలిగిన కాఫీ, టీ పొడులను వాడాలి



టీ, కాఫీ యజమానులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పులివెందుల టౌన్ : ఐఎస్ఐ మార్క్ కలిగిన కాఫీ, టీ పొడులను వాడాలని మున్సిపల్ కమిషనర్ రాముడు షాపు యజమానులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు టీ, కాఫీ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ ప్రజారోగ్య హానికరమైన పేపర్ గ్లాసులను ఉపయోగించరాదన్నారు. అనంతరం సచివాలయ శానిటరీ సెక్రటరీలు కూరగాయల మార్కెట్‌లోని అంగళ్లను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అచ్చివెళ్లి గ్రామంలో మురికి కుంటలో అబైట్‌ను పిచికారి చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య ప్రజలకు సూచించారు. శుక్రవారం అచ్చివెళ్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే, లార్వా సర్వేలు నిర్వహించారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని, దోమల నివారణకు నీ టి నిల్వలు తొలగించడంతోపాటు మురికి కుంటల లో అబైట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అడ్డగుట్ట ఆంజనేయస్వామి ఆలయానికి మహర్దశ



పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అరటి పరిశోధనా కేంద్రం సమీపంలోని అడ్డగుట్ట ఆంజనేయ స్వామి ఆలయం వెలసి చాలా కాలమైంది. అయితే ఇక్కడ ఏపీ మైనింగ్ ఉన్న సమయంలో దాదాపు 40 ఏళ్లకు పైగా ఇక్కడ అంజన్న ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం మైనింగ్ పనులు నిలిచిపోవడంతో ఆలయం ఆలనా పాలనా కరువైంది. అయితే హిందు బంధువులు ఆలయ పరిసరాలను చూసి పూజలు అంతంత మాత్రం జరుగుతున్న విషయం గమనించి కొంతమంది ఆలయాన్ని రూపురేఖలు మార్చారు. దాతల సాయంతో తమ సొంత నిధులతో ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. శ్రావణ మాసంలో ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడ విశేష పూజలు జరిపించి భక్తుల రాకపోకల కోసం అన్ని సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు చేసేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. నూతన ధ్వజ స్తంభం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ ప్రాంతం ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉండటంతో భక్తులు తాకిడి పెరిగే అవకాశం ఉంది.